సాక్షి వనపర్తి

ఆదివారం । 23 । జూలై । 2023



వైకుంఠధామాలే ఆవాసం..

వైకుంఠధామాలు.. సెగ్రిగేషన్ షెడ్లే వారికి ఆవాస, నివాస ప్రాంతాలయ్యాయి.

వివరాలు 8లో ▸

'దరఖాస్తు'కు వేళాయె

'ఇన్‌స్పైర్ మనక్' దరఖాస్తుకు వచ్చే నెల ఆఖరు వరకు గడువు పొడిగించింది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.9 /22.7

ఉదయం నుంచి మేఘావృతమై ఉంటుంది. రోజంతా ముసురు పడటంతోపాటు అడపా దడపా భారీ వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఇంట్లోని ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మలేరియా సబ్‌యూనిట్ అధికారి అయూబ్‌ఖాన్ తెలిపారు. మున్సిపాలిటీ కేంద్రంలోని ఐదో వార్డులో శనివారం ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వర్షాకాలంలో ఈగలు, దోమల సంతతి పెరిగే అవకాశం ఉందన్నారు. ఇంటి ముందు వర్షపు నీటితో పాటు ఇంట్లో నుంచి వస్తున్న మురుగు నిల్వ ఉండటంతో వాటిలో దోమలు, ఈగలు గుడ్లు పెట్టి వ్యాప్తి చెందే వీలుందన్నారు. ఇంట్లో వృథాగా ఉన్న వాటర్ ట్యాంక్‌లు, నీటి తొట్టెలు, విరిగిపోయిన ఎయిర్ కూలర్లను ఇంటికి దూరంగా ఉంచాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

'సమాజం తలదించేలా మణిపూర్ ఘటన'

వనపర్తి: మణిపూర్‌లో చోటుచేసుకున్న ఘటనకు సమాజం తలదించుకోక తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మహిళలపై పెరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టే చర్యలు తీసుకోవటంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఘటనకు బాధ్యత వహించి అక్కడి పాలకులు పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓ వైపు బేటీ బచావో అనే నినాదాన్ని తెరపైకి తీసుకొచ్చిన నాయకులు సామాన్య గిరిజన మహిళలకు రక్షణ కల్పించటంలో శ్రద్ధ చూపాలన్నారు. ఇలాంటి ఘటనలు బయటికి రాకుండా ఇంటర్నెట్ సేవలు 80 రోజులుగా నిలిపివేయటం శోచనీయమన్నారు. తక్షణమే ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి, నిందితులకు తగిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పుట్ట ఆంజనేయులు, బాల్‌రెడ్డి, గోపి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతిఒక్కరి బాధ్యత

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని అమడబాకుల సమీపంలోని భీమా కాల్వకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మనిషి మనుగడ మొక్కలతోనే ముడిపడిందన్నారు. చెట్లు ఎక్కువగా ఉండటంతో వాతావరణం కలుషిత కాకుండా ఉండటంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, అంతే కాకుండా భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందిస్తామన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించుకోవడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. బుచ్చన్న, శేషిరెడ్డి, చిన్నమ్మ, శివ, కొల్లంపల్లి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని ప్రేమించడం అలవర్చుకోవాలి



వనపర్తిటౌన్: ప్రకృతిని, మొక్కలను ప్రేమించడం ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. మూడు సంవత్సరాలుగా తమ ఇంట్లో రూఫ్ గార్డెన్‌ను పెంచుతున్న జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకటరమణ మంజుల దంపతులను సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో శనివారం వారి ఇంట్లో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడారు. వృత్తి రీత్యా వెంకటరమణ ఉన్నత ఉద్యోగి అయినప్పటికీ తీరిక సమయంలో మొక్కలు పెంచుతూ సమాజానికి మంచి ఆదర్శంగా నిలిచాడని, ఇప్పటికే కొన్ని వందల మొక్కలు పెంచారని తెలియజేశారు. మా గార్డెన్‌లో అరుదైన వైద్య మొక్కలను పెంచుతున్నామని, మొక్కలను పెంచడం అలవాటుగా మారిందని దంపతులు పేర్కొన్నారు.

విద్యుదుత్పత్తి షురూ..



జూరాల జెన్‌కో స్విచ్ యార్డు

సంవత్సరం	మిలియన్ యూనిట్లు	
	ఎగువలో	దిగువలో
2014- 15	225	-
2015- 16	316	45
2016- 17	213	177
2017- 18	217	206
2018- 19	166	154
2019- 20	301	305
2020- 21	370	405
2021- 22	335	369
2022- 23	450	426
2023-24 (టార్గెట్)	320	-

నాలుగు యూనిట్లలో ఉత్పత్తిని ప్రారంభించిన అధికారులు

- 12 యూనిట్లలో ఎగువ, దిగువ కేంద్రాల లక్ష్యం 640 మిలియన్ యూనిట్లు
- గతేడాది రికార్డు స్థాయిలో 876 మి.యూ.సాధన
- ఎగువ కర్ణాటక వరద జలాలే ఆధారం
- కేంద్రాల ప్రారంభం నుంచి 4,680 మి.యూ.ఉత్పత్తి



పూజలు చేసి ఎగువ జూరాలలో విద్యుదుత్పత్తిని ప్రారంభిస్తున్న జెన్‌కో ఎస్ఈ రామసుబ్బారెడ్డి

ఆత్మకూర్: రాష్ట్రంలోని కృష్ణానదిపై మొదటి ప్రాజెక్టు ప్రియదర్శిని జూరాలపై నిర్మించిన జల విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. శనివారం సాయంత్రం ప్రాజెక్టుకు వరద ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో రాత్రి 9 గంటల సమయంలో జెన్‌కో ఎస్ఈ రామసుబ్బారెడ్డి పూజలు చేసి, ఈ ఏడాది తొలిసారిగా ఎగువ కేంద్రంలో రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. రాత్రి 10.45 గంటలకు దిగువ జూరాలలో మరో రెండు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ప్రారంభించారు.

⇨ కాగా.. గతేడాది జూన్‌లోనే జూరాలకు వరద నీరు పెద్దఎత్తున చేరడంతో ప్రాజెక్టు చరిత్రలోనే 640 మిలియన్ యూనిట్ల టార్గెట్‌కు మించి 876 మి.యూ., విద్యుదుత్పత్తి చేపట్టి రికార్డు సృష్టించారు. 2020-21 సంవత్సరంలో 324 మి.యూ., లక్ష్యానికి గాను 384 మి.యూ., ఉత్పత్తిని విజయవంతంగా చేపట్టారు. 2021-22లో 724 మి.యూ.,కు గాను 704 మి.యూ., సాధించారు.

2014-15 నుంచి..

జూరాల ప్రాజెక్టు దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేపట్టవచ్చు. ఇందుకు గాను టార్గెట్ 320 మి.యూ., ఉండగా.. ఎగువ జల విద్యుత్ కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేపడుతారు. ఇక్కడ కూడా 320 మి.యూ., లక్ష్యం కాగా.. 12 యూనిట్లను విద్యుదుత్పత్తికి పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. 2014- 15 సంవత్సరం నుంచి 2022- 23 వరకు మొత్తం 4,680 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించారు.

వరద నీరే ఆధారం..

జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని నారాయణపూర్, ఆల్మట్టి జలాశయాల ద్వారా వచ్చే వరద నీటితోనే ఇక్కడ విద్యుదుత్పత్తికి ఆస్కారం ఉంది. ఈ ఏడాదిలో ఇప్పుడిప్పుడే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తుంది. దీంతో ఆయా ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో నీరు చేరిన తర్వాతే దిగువకు వదులుతారు. ఇక్కడ వర్షాలు పూర్తిగా మొహం చాటేయడంతో ఎగువ ప్రాజెక్టులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

సమష్టి కృషితోనే..

జూరాల ప్రాజెక్టుపై నిర్మించిన ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల ద్వారా సిబ్బంది సహకారంతో లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆయా కేంద్రాల్లోని 12 యూనిట్లు ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా సిద్ధం చేశాం. గతేడాది 640 మి.యూ., లక్ష్యానికి గాను 876 మి.యూ., ఉత్పత్తి సాధించాం. శనివారం ఎగువ కర్ణాటక నుంచి వరద రావడంతో విద్యుదుత్పత్తి ప్రారంభించాం. – రామసుబ్బారెడ్డి, ఎస్ఈ, జెన్‌కో

ప్రతిఒక్కరికీ పని కల్పించడమే లక్ష్యం



తోపుబండ్ల హమాలీ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: అర్హులైన ప్రతిఒక్కరికీ పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఎనిమిదో వార్డులో తోపుడుబండ్ల హమాలీ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం రూ.5 లక్షల ప్రొసిడింగ్ కాపీని వారికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తూ.. ప్రభుత్వ పాలన చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో పుష్కలంగా సాగునీటి లభ్యత పెరగటంతో ప్రజల ఆలోచన తీరులో మార్పు వచ్చిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన ఈ తొమ్మిదేళ్లలో ఉపాధి అవకాశాలు విరివిగా పెరిగాయన్నారు. జీవనోపాధి కోసం వలసలు వెళ్లిన రోజులను మరిపించేలా మన రాష్ట్రానికి పని కోసం ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చేస్థాయికి చేరుకున్నట్లు తెలిపారు. వనపర్తిని జిల్లా కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయటంతో పెద్ద ఎత్తున షోరూంలు, విద్యాసంస్థల ఏర్పాటుకు అనువుగా మారిందన్నారు. జెడ్పీచైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్, కౌన్సిలర్లు నాగన్నయాదవ్, రాములు, తిరుమల్, తోపుడు బండ్ల సంఘం అధ్యక్షుడు బాలస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి

ప్రభుత్వం కల్పించిన ఈ సదావకాశాన్ని వినియోగించుకుని విద్యాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖలోని మూడు వేర్వేరు కేటగిరీల్లో ఉద్యోగాలు సాధించిన 18 మందికి నియామక పత్రాలను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి అందజేశారు. 2014లో రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించిన ఐఈఆర్‌పీ, డీఈఓ, ఎంఐఎస్‌ల ఎంపిక పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు ప్రభుత్వ ఆదేశం మేరకు ఇటీవల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిర్వహించి అర్హతను బట్టి పోస్టింగ్ కల్పించారు. జిల్లాకు 18 మందిని కేటాయించగా.. 10 ఐఈఆర్‌పీ, 04 డీఈఓ, 04 ఎంఐఎస్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు.

రాయితీ తోటల పెంపకంపై ఆసక్తి చూపండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్

కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: పండ్ల తోటలు, ఆకుకూరగాయల పెంపకానికి ఎన్ఆర్‌ఈజీఎస్ అందిస్తున్న రాయితీ అవకాశాన్ని వెనుకబడిన తరగతుల వారితో పాటు ఐదెకరాల్లోపు పొలం ఉన్న గ్రామీణ ప్రాంత చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఈ విషయంపై అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలు, మార్కెట్‌లో ఎలాంటి పంటలకు అధిక ధరలు ఉన్నాయనే విషయాన్ని రైతులు గమనించి, మార్కెట్‌ను బట్టీ సాగు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు టీఏలు రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాలో మొదటి దశలో 1,835 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. ఇందుకు సరిపడా లబ్ధిదారుల ఎంపికను ఈ నెల 31లోపు పూర్తి చేయాలని, ఆగస్టు 15లోపు ఉపాధిహామీ పోర్టల్‌లో ఎస్టిమేషన్ పూర్తి చేయాలన్నారు. గుర్తించిన రైతుల భూమిలో డ్రిప్ వేయడం, గుంతలు తవ్వడం ఆగస్టు 31 నాటికి పూర్తి చేసి మొక్కలు నాటాలన్నారు. సబ్సిడీపై మొక్కలు ఇవ్వడం, ఉపాధిహామీ ద్వారా గుంతలు తవ్వించడం, సబ్సిడీపై డ్రిప్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు.

జూరాల వైపు కృష్ణమ్మ పరుగులు



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం

- ప్రాజెక్టుకు 34 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు/ కృష్ణా/ మదనాపురం/ దేవరకద్ర: ఎట్టకేలకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. ఎగువనున్న ముంబయి, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తుండటంతో శనివారం మధ్యాహ్నం నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. ఈ క్రమంలో జూరాలకు ఎగువ నుంచి 34 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువ ఉన్న భీమా ప్రాజెక్టు (సన్నతి బ్యారేజ్) నుంచి 28 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో నెట్టెంపాడు ఎత్తిపోతలలో ఒక పంపును ప్రారంభించి 750 క్యూసెక్కులను ఎత్తిపోస్తున్నారు. అలాగే జూరాల ఎడమ కాల్వ ద్వారా 820, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు వదిలారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.971 టీఎంసీల నీరు నిల్వ ఉంది. విద్యుదుత్పత్తికోసం 15వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మొత్తం ప్రాజెక్టు నుంచి 17,457 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టు నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 45.50 టీఎంసీల నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 83,945 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. దిగువకు 3,576 క్యూసెక్కులు వదులుతున్నారు. అలాగే నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 17.32 టీఎంసీలు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 637 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి 50 క్యూసెక్కులు వదులుతున్నారు.

❒ కృష్ణా మండలంలోని కృష్ణానదికి శనివారం సాయంత్రం ఎట్టకేలకు వరద రావడంతో తీర ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి నీళ్లు వచ్చాయి. ఇక వరి నాట్లు వేసుకునేందుకు అవసరమయ్యే నీరు రావడంతో సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతులు భావిస్తున్నారు.

❒ మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయానికి జూరాల ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కు.. మొత్తం 1,670 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కాగా ఎన్టీఆర్ కాల్వకు నీటిని వదలలేదు. కేవలం తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదలామని ఏఈ రసీల్‌రెడ్డి తెలిపారు.

❒ కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకు పెరుగుతుంది. జూరాల నుంచి నీటిని పంప్‌హౌస్‌లకు తరలించి, అక్కడి నుంచి మోటారు ద్వారా కోయిల్‌సాగర్‌కు నీటిని తరలిస్తున్నారు. దీంతోపాటు కురుస్తున్న వర్షాలతో పెద్దవాగు ప్రవాహం వస్తుండటంతో ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 20.6 అడుగులకు చేరింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


వనపర్తి: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. శనివారం ఆయన తనఛాంబర్ నుంచి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలిచ్చారు. పాతమిద్దెలు, కాల్వల వెంట ఉండే రోడ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రహదారులపై అడ్డంగా నీరు పారే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా వర్షాలకు కొత్తనీరు ప్రవహించే వాగులు వంపులు, కాల్వలు లేదా ప్రాజెక్టుల వంటి ప్రదేశాల్లో చేపలు పట్టే జాలర్లు, యువకులను అప్రమత్తం చేయాలన్నారు. నీటి ప్రవాహాన్ని చూసేందుకు విద్యార్థులు, యువతీ యువకులు వెళ్లే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంటుందని, స్థానిక అధికారులు పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. రేవల్లి మండలంలోని తలుపునూరులో పాఠశాల భవనం ప్రమాదకరంగా ఉందని, వెంటనే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు సందర్శించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో చెత్త ప్లాస్టిక్‌తో పేరుకుపోయిన డ్రైనేజీలతో ఎక్కువగా ఇబ్బందులు వస్తాయని, వీటిలో నీరు నిల్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మరమ్మతులు చేస్తున్న రహదారుల వద్ద, వివిధ భవనాల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున, ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో టీంలు ఏర్పాటు చేసుకుని రాత్రి సమయాల్లో సైతం చురుకుగా ఉండాలన్నారు. వర్షాల కారణంగా నీటి పరీక్షలు నిర్వహించేందుకు మిషన్ భగీరథ అధికారులు కావాల్సిన పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. సెలవు రోజైన ఆదివారం సైతం అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతి రావు, ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి, జెడ్పీ సీఈఓ శ్రావణ్‌కుమార్, ఆర్డీఓ పద్మావతి, నీటి పారుదల శాఖ ఈఈ మధుసూదన్‌రావు, పంచాయతీరాజ్ ఈఈ మల్లయ్య, దేశ్యానాయక్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఆర్టీసీకి ఇం'ధనం'

- డిపో ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు
- కల్తీకి అవకాశం లేకుండా వినియోగదారులకు అందజేత
- ప్రతి నెల రూ.2లక్షలకు పైగా ఆదాయం
- తొమ్మిది మంది నిరుద్యోగులకు ఉపాధి, ముగ్గురు ఆర్టీసీ ఉద్యోగులకు వేతనాలు



ఆర్టీసీ డిపో ఆరుబయట ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్



వనపర్తిటౌన్: వనపర్తి ఆర్టీసీకి ఇంధన రూపంలో ఆదాయం సమకూరుతుంది. ఆర్టీసీ డిపో పరిధిలోని బస్టాండ్ రూట్‌లో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ద్వారా పెట్రోల్, డీజిల్, పవర్ పెట్రోల్‌ను విక్రయిస్తూ అదనంగా ఆదాయం పొందుతున్నారు. ఇంధన ఆదాయం ద్వారా 9 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటుగా ముగ్గురు ఉద్యోగులకు వేతనాలు సైతం ఇంధన రూపంలో వచ్చే ఆదాయం ద్వారానే చెల్లిస్తున్నారు. ప్రతినెల వచ్చిన రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల ఆదాయంలో ఇంధనం కొనుగోలు ఖర్చులు, జీత భత్యాలు, విద్యుత్ బిల్లులు, ఇతరత్ర మెయింటెనెన్స్ ఖర్చులు పోనూ రూ.2.50 లక్షల పైచిలుకు ఆర్టీసీ ఖాతాలో జమ చేస్తున్నారు.

- ఆర్టీసీ డిపోలో అందుతున్న ఇంధనం ఏ మాత్రం కల్తీకి అవకాశం లేకుండా ఉంది. హెచ్‌పీసీఎల్ ఘట్‌కేసర్ నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇంధనాన్ని కొనుగోలు చేసిన కంపెనీ వద్ద లాక్ చేస్తే సరిగ్గా ఏ మాత్రం తేడా లేకుండా వనపర్తి ఆర్టీసీ పెట్రోల్ బంక్ వద్దే ఓటీపీ చెబితేనే ఇంధనం బంక్‌లో పోయించుకునేందుకు అవకాశం ఉంటుందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

ఉదయం 6 గంటల నుంచి..

- ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పెట్రోల్ బంక్ అందుబాటులో ఉంటుంది. ఆర్టీసీ బంక్ కావడంతో రీడింగ్ కరెక్ట్‌గా ఉంటుందని వినియోగదారులు అధిక ఆసక్తి చూపుతున్నారు. అవసరాన్ని బట్టి నాలుగు రోజులకోసారి 15 వేల లీటర్ల పెట్రోల్, 8 వేల లీటర్ల డీజిల్, పవర్ పెట్రోల్ 15 రోజులకోసారి 4 వేల లీటర్లు ఆన్‌లైన్‌లో బుక్ చేసి కొనుగోలు చేస్తున్నారు. ప్రతి రోజూ 3,800 లీటర్ల పెట్రోల్, 1,800 లీటర్ల డీజిల్, 200 లీటర్ల పవర్ పెట్రోల్ విక్రయిస్తున్నారు.

- పెట్రోల్ బంక్ ప్రైవేట్ ఆధీనంలో ఉన్నప్పుడు ప్రతినెల రూ.63 వేలు మాత్రమే ఇంధన కంపెనీ నుంచి ఆర్టీసీకి అందేది. ప్రస్తుతం అందుకు భిన్నంగా 10 రెట్ల ఆదాయం ఆర్టీసీకి అందుతుంది.

ప్రతి నెల రూ.6 లక్షల వరకు ఆదాయం..

ప్రతి నెల పెట్రోల్ నుంచి రూ.4.20లక్షలు, డీజిల్ నుంచి రూ.1.78లక్షలు, పవర్ పెట్రోల్ నుంచి రూ.23 వేల వరకు ఆదాయం వస్తుంది. ప్రతి నెల రూ.5లక్షల నుంచి రూ.6 లక్షల మధ్య ఆదాయం వస్తుంది. తొమ్మిది మందికి రోజుకు రూ.450 చొప్పున, విద్యుత్ బిల్లు రూ.10 వేలు, ముగ్గురు ఉద్యోగుల వేతనాలు రూ.1.50లక్షలు పోగా.. రూ.2.50లక్షల పైచిలుకు ఆదా అవుతోంది. 2022 జూలై 16 నుంచి ఆర్టీసీ డిపో ఆధీనంలోకి రాగా, అంతకు ముందు ప్రైవేట్ అధీనంలో నామ మాత్రం రుసుము చెల్లించేవారు.

మెరుగైన సేవలు

ప్రయాణికులకు బస్సుల ద్వార సేవలందిస్తున్నట్లే, వినియోగదారులకు మెరుగైన సేవలు ఆర్టీసీ పెట్రోల్ బంక్ ద్వార అందిస్తున్నాం. ఇంధన కొనుగోలు, వేతనాలు, నిర్వహణ ఖర్చులు పోను ఆర్టీసీకి అదనంగా ఆదాయం సమకూరుతుంది. ఆర్టీసీ పెట్రోల్ బంకుల్లో కల్తీ ఉండదు, హెచ్చుతగ్గులు ఉండవు, నాణ్యతగా ఉంటుంది. – పరమేశ్వరి, డిపో మేనేజర్, వనపర్తి

ప్రతినెల వచ్చిన ఆదాయం, ఖర్చులు, వివరాలు

మాసం	పెట్టుబడి	ఖర్చులు	ఆదాయం
మార్చి	4,75,440	2,53,852	2,21,588
ఏప్రిల్	4,93,034	2,63,879	2,29,155
మే	5,49,687	2,58,000	2,91,686
జూన్	4,50,154	2,67,302	1,82,852

క్లుప్తంగా

కారు, బైక్ ఢీ: ఒకరు దుర్మరణం

● మరొకరి పరిస్థితి విషమం

అమ్రాబాద్: కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా మారిన ఘటన శనివారం అమ్రాబాద్ సమీపంలోని మద్దిమడుగు ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అమ్రాబాద్ మండలం ఎమిరెడ్డిపల్లికి చెందిన చిక్కుడు సత్యానారాయణ(38), దుద్దు అనీల్ కలిసి బైక్‌పై కుమ్మరోనిపల్లికి వెళ్తున్నారు. ఆ సమయంలో మద్దిమడుగు వైపు నుంచి వస్తున్న మారుతి కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందగా, అనీల్‌కు తల, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు సీఐ ఆదిరెడ్డి పోలీసులతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన అనీల్‌ను 108లో అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేట్ వాహనంలో హైదరాబాద్‌కు తరలించారు. సత్యనారాయణకు భార్య భాగ్య, కూతురు, కుమారుడు, తల్లి లక్ష్మీదేవి ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని అమ్రాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఊట్కూరు: భర్త వేధింపులు భరించలేక ఓ వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటన శనివారం మండలంలోని అమీన్‌పూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. దామరగిద్ద మండలంలోని గడిముున్కన్‌పల్లికి చెందిన యువతి వైష్ణవి అలియాస్ మౌనిక(19)ని మండలంలోని అమీన్‌పూర్ గ్రామానికి చెందిన మల్లప్పకు ఇచ్చి ఏడాదిక్రితం వివాహం చేశారు. ఆరు నెలలుగా భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని, ఈ విషయమై పుట్టింటికి వెళ్లగా పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి, కాపురానికి పంపారు. అయినా వేధింపులు ఆపకపోవడంతో మనస్తాపానికి గురై ఈనెల 12న పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు నారాయణపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి మొగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమేశ్ తెలిపారు.

అరుణాచలంకు ప్రత్యేక లగ్జరీ సర్వీసులు

స్టేషన్ మహబూబ్‌నగర్: వచ్చేనెల 1వ తేది పౌర్ణమిని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్‌ను నడపనున్నట్లు డిపో మేనేజర్ సుజాత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 31న బస్టాండ్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరుతాయని, మార్గమధ్యంలో కాణిపాకం గణపతి దర్శనం అనంతరం రాత్రికి అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. 1న అరుణాచాలం గిరి ప్రదక్షిణ తర్వాత మధ్యాహ్నం బస్సు బయలుదేరి వేలూరులోని గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకొని మహబూబ్‌నగర్‌కు మరుసటి చేరుకుంటుందని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం 99853 20529, 73828 27102 నంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.



వైకుంఠధామం వద్ద నిర్మించిన గదిలో చెంచుల నివాసం



చౌదర్‌పల్లిలో సెగ్రిగేషన్ షెడ్లో నివాసం ఉంటున్న చెంచులు

వైకుంఠధామాలే ఆవాసం.. సెగ్రిగేషన్ షెడ్లే నివాసం

● 'డబుల్' బుట్టదాఖలు.. కనిపించని కాంట్రాక్టర్లు
● చినుకు పడితే కునుకు కరువు..
● దయనీయంగా చెంచుల జీవనం..
● పట్టించుకోని పాలకులు, అధికారులు

గండేడ్/మహమ్మదాబాద్: ఒకప్పుడు బాత్‌రూంలే, నేడు వైకుంఠధామాలు.. సెగ్రిగేషన్ షెడ్లే ఇప్పుడు వారి ఆవాస, నివాస ప్రాంతాలు. తరాలు మారినా వారి తలరాతలు మార్చే నాథుడే కరువయ్యాడు. ఇది ఆయా గ్రామాల్లో ఉండే చెంచుల దుర్భర స్థితి. పాలకుల, అధికారుల హామీలు బుట్టదాఖలు కావడంతో వారి జీవనం వానకు వనుకుతూ, ఎండకు మాడుతూ సాగుతోంది. గండేడ్ మండలంలోని పగిడ్యాల్, కొండాపూర్, జక్లపల్లి గ్రామాలు, మహమ్మదాబాద్ మండలంలోని ధర్మాపూర్, చిన్నాయిపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో కొన్ని వందల కుటుంబాల జీవనం ఇలాగే ఉంది. వీరికి ఉపాధితో పాటు గూడు కరువైంది.

హామీలతో ఆగమైన బతుకులు..

చౌదర్‌పల్లిలో 15 చెంచు కుటుంబాలున్నాయి. కొందరు గ్రామంలో, మరికొందరు అడవిలో గుడిసెలు వేసుకోని బతుకుతున్నారు. వాన, గాలులకు వారి కష్టాలు వర్ణనాతీతం. గతేడాది కొత్త ఇళ్లు నిర్మించి ఇస్తామన్న పాలకుల, అధికారుల మాటలు నమ్మిన చెంచులు గుడిసెలు తొలగించి చదును చేయాలని చెప్పారు. ఉన్న గుడిసెలను తొలగించుకొని పది కుటుంబాలు వైకుంఠధామానికి వెళ్లగా, మరికొందరు సెగ్రిగేషన్ షెడ్లలోకి మకాం మార్చారు. ఊరికి దూరంగా ఉండే వారి పరిస్థితి మరింత దుర్భరంగా గాలివానకు, చలికి వణుకుతున్నారు. కరెంట్, నీళ్లు లేక అంధకారంలో బతుకుతున్నారు.

ఏడాదికాలంగా..

అర్హులైన చెంచులకు ఒక్కొక్కరికి డబుల్ బెడ్రూం ఇస్తామని ప్రకటించారు. అప్పట్లో పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి చౌదర్‌పల్లికి 10, చిన్నాయిపల్లికి 60 ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. అప్పుడున్న అధికారులకు సైతం చెంచులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పక్కా ఇళ్లు కట్టి ఇవ్వాలని చెంచులు కోరుతున్నారు.



చౌదర్‌పల్లిలో శిథిలావస్థలో చెంచుల గుడిసెలు

పల్లెప్రగతి పేరుతో కూల్చివేత..

కొండాపూర్, పగిడ్యాల్, చిన్నాయిపల్లి గ్రామాల్లో 50 ఏళ్ల క్రితం కట్టుకున్న ఇందిరమ్మ ఇళ్లు శిథిలావస్థకు చేరడంతో కూల్చేశారు. అప్పటి కలెక్టర్ రోనాల్డ్‌రోస్ ఆదేశంతో చిన్నాయిపల్లిలో 70 ఇళ్లలో 40 ఇళ్లను తొలగించారు. దీంతో చెంచులకు గూడు కరువైంది. అడవిలో ఉంటున్న చెంచుల్లో ఒక వ్యక్తికి పాము కరవడంతో చనిపోయాడు. విషపురుగులతో వారు బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

గూడు లేకుండా చేశారు..



ఇళ్లు శిథిలమయ్యాయని అధికారులు కూలగొట్టి గుడిసెలు వేయించారు. కొన్ని రోజులకు గుడిసెలు కూడా కూలి పోయాయి. కొత్త ఇళ్లు నిర్మిస్తామని అక్కడి నుంచి ఖాళీ చేయించారు. ఊళ్లో ఇల్లు లేక వైకుంఠధామంలో ఉంటున్నాం. కరెంట్ లేదు, నీళ్లు లేవు, చీకట్లో భయంగా బతుకుతున్నాం.

– చెంచు అలివేలు, చౌదర్‌పల్లి, మహమ్మదాబాద్ మండలం

మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం..



ఇందిరమ్మ కాలంలో ఇళ్లు ఇచ్చారు. ఇప్పుడు అది వర్షానికి కురుస్తోంది. గోడలు బీటలు వారాయి. కిటికీలు లేవు, వర్షాకాలం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉంటున్నాం. ఇప్పుడు అమ్మ ఒక్కరే ఆ ఇంట్లో ఉంది. ఎప్పుడు ఏమవుతుందోనని భయంతో ఉన్నాం.

– చెంచు అంజిలయ్య, పగిడ్యాల్

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు..

ఆరు నెలల క్రితం డబుల్ బెడ్రూంకు రూ.5 లక్షల చొప్పున 70 ఇళ్లు మంజూరయ్యాయి. చౌదర్‌పల్లికి 10, చిన్నాయిపల్లికి 60 మంజూరు కాగా, వాటిని నిర్మించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. చౌదర్‌పల్లిలో అదే గ్రామానికి చెందిన సతీష్‌రెడ్డి కట్టడానికి ముందుకొచ్చారు. పది రోజుల్లో మార్కింగ్ ఇస్తాం. చిన్నాయిపల్లి ఇళ్ల విషయం ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారికి ఇళ్లు కట్టించేలా చూస్తాం.

– ఛత్రునాయక్, డీటీడీఓ, మహబూబ్‌నగర్

డైనింగ్ హాల్ పనులు ప్రారంభం



ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న డైనింగ్‌హాల్

గండేడ్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ పనులు ప్రారంభమయ్యాయి. పాఠశాలలో డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు నిలబడే భోజనాలు చేస్తున్నారని గత గురువారం 'సాక్షి'లో 'వణికిస్తున్న బడులు' శీర్షికన ప్రచురితమై కథనానికి అధికారులు స్పందించారు. దీంతో కాంట్రాక్టర్‌తో మాట్లాడి శనివారం పనులు ప్రారంభమయ్యేలా చొరవ చూపారు. పాఠశాలలో 420 మంది విద్యార్థులు ఉండటంతో మధ్యాహ్న సమయంలో ఎక్కడ కూర్చొని భోజనం చేయాలన్నా ఇబ్బందికరంగా ఉండేది. ఫలితంగా కొందరు చెట్లకింద భోజనం చేసేవారు. అయితే వర్షాల కారణంగా ఎక్కడబడితే అక్కడ నిలబడి భోజనాలు చేస్తున్నారు. ఇప్పటికైనా త్వరగా డైనింగ్ హాల్ నిర్మాణం చేపడితే సమస్య తీరిపోతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

క్లూస్‌టీం ఎస్‌ఐకి ప్రశంసాపత్రం



మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ కేసును ఛేదించడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ఉత్తమ ప్రతిభ చూపిన క్లూస్‌టీం ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్‌ను శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ ప్రశంసాపత్రంతో సత్కరించారు. జిల్లా నుంచి క్లూస్‌టీం విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రశంసాపత్రం అందుకోవడంతో జిల్లా ఎస్పీ కె.నరసింహ ప్రత్యేకంగా ఎస్‌ఐని అభినందించారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్కూల్ స్వీపర్ల సమస్యలను పరిష్కరించే దాక పోరాటం చేస్తామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ హెచ్చరించారు. స్వీపర్ల ధర్నా శనివారం 27వ రోజుకు చేరిన సందర్భంగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న, చంద్రాయుడు, బాలగౌడ్, బాలరాజు, జమీర్‌పాషా పాల్గొన్నారు.


పట్టపగలే హుండీ చోరీ

● కారులో వచ్చారు.. సీసీ కెమెరాకు చిక్కారు

అమరచింత: పట్టపగలే ఆలయంలో హుండీ చోరీకి పాల్పడిన సంఘటన శనివారం వెలుగుచూసింది. ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు.. మండలంలోని పాత కిష్టంపల్లిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో దుండగులు హుండీని పగులగొట్టి రూ.రెండు లక్షలు నగదు, అలాగే వెండి నగలు అపహరించారు. ఆలయంలో పూజలు నిర్వహించడానికి శనివారం ఉదయం ఆలయ పూజారి సోములు వెళ్లాడు. తాళాలు పగులగొట్టి ఉండటంతో హుండీని గమనించాడు. పగిలి ఉండటంతో వెంటనే సర్పంచ్‌తోపాటు ఆలయ కమిటీ సభ్యులకు తెలిపారు. వారు అక్కడికి చేరుకుని పోలీసులకు తెలిపారు. ఎస్‌ఐ జగన్మోహన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఉండటంతో పుటేజీని పరిశీలించారు. ఈ ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, విచారణ చేస్తున్నారు.

కారులో వచ్చి...

వికారాబాద్‌కు చెందిన అంబిరియా నానవత్ (టీఎస్ 34 టీఏ 0783) కారులో కిష్టంపల్లి ఆలయానికి చేరుకున్నారు. ఎవరూ లేకపోవడంతో ఆలయంలోకి చొరబడ్డారు. తాళాలు పగులగొట్టిన అనంతరం కారులో ఉన్న మహిళ ఆలయ గర్భగుడిలోకి వెళ్లి హుండీలోని నగదు తీసుకున్నారు. కారు నంబర్‌ను పోలీసులు ట్రేస్ చేయగా కారు వికారాబాద్‌కు చెందిన అంబిరియా నానవత్ అనే వ్యక్తిదిగా గుర్తించారు. ఇదే కారుకు జూలై 3న నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్‌లో ఫైన్ వేసినట్లు గుర్తించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.



కిష్టంపల్లి ఆలయంలో విచారిస్తున్న ఎస్‌ఐ. సీసీ కెమెరాలలో నమోదైన దృశ్యాలు



నిందితులు వచ్చిన కారు ఇదే..

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెబ్బేరు రూరల్: ఇంటోఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వనపర్తి మండల పరిధిలోని కడుకుంట్లలో చోటుచేసుకుంది.

గ్రామస్తుల వివరాల ప్రకారం.. కడుకుంట్లకు చెందిన సురేష్(32), మమత భార్యాభర్తలు, వారికి కుమారుడు ఉన్నారు. మూడు రోజుల క్రితం మమత బాబును తీసుకొని పుట్టింటికి వెళ్లింది. ఆమె వెళ్లిన రోజే ఇంట్లో ఎవరూ లేని సమయంలో సురేష్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇల్లు మూసుకొని ఉండగా, ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో శనివారం గ్రామస్తులు వెళ్లి చూశారు. ఇంట్లో తాడుతో వేలాడుతూ సురేష్ కనిపించడంతో వెంటనే భార్యకు సమాచారం అందించారు. ఆమె వచ్చిన తర్వాత దహన సంస్కారాలు నిర్వహించారు.

అనంతవరంలో..

బల్మూర్: కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలోని అనంతవరంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గూడెలి వెంకటయ్య(48) శనివారం సాయంత్రం ఎవరూ లేని సమయంలో ఇంటి ఎదురుగా ఉన్న కొట్టంలోకి వెళ్లి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయ కూలీపనులకు వెళ్లి ఇంటికొచ్చిన కుటుంబ సభ్యులు వేలాడుతున్న అతన్ని చూసి బోరున విలపించారు. అతనికి ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలువిరిగింది. ఇంటి పెద్దదిక్కు మంచాన పడడంతో భార్య, పిల్లలు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య బాలమ్మ పేర్కొన్నది. అతనికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి మరొకరు..

తెలకపల్లి: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పర్వతాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. పర్వతాపూర్ గ్రామ శివారులోని శివాలయం వద్ద ఓ వ్యక్తి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పర్వతాపూర్ గ్రామస్తులు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి అతన్ని తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతను ఉప్పునుంతల మండలం, దాసర్లపల్లికి చెందిన రాములు (70)గా గుర్తించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

భూత్పూర్: మూసాపేట మండలంలోని జానంపేటలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను పట్టుకొని శనివారం రాత్రి రిమాండ్ తరలించినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలిపారు. మూసాపేట మండలం జానంపేటకు చెందిన దాసు రాంచంద్రయ్య ఇంటికి తాళం వేసి గత శనివారం మహబూబ్‌నగర్‌లో తన కుమారుడి ఇంటికి వెళ్లారు. దీన్ని గమనించిన దుండగులు అదేరోజు రాత్రి తాళం విరగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగల గొట్టి అందులోని 8.8 తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదును చోరీ చేశారు. మరుసటి రోజు వచ్చిన రాంచంద్రయ్య తనఇంట్లో చోరీ జరిగినట్లు మూసాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో శనివారం మూసాపేట ఎస్‌ఐ, సిబ్బంది, సీసీ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చక్రాపూరు స్టేజీ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు కనిపించారు. షేక్‌వలీ బాబా, షేక్ నగూర్ వలీని పట్టుకొని విచారించగా రాంచంద్రయ్య ఇంట్లో తామె చోరీ చేసినట్లు పోలీసులకు వెల్లడించారు. వారి వద్ద 3తులాల లాంగ్ గోల్డ్ చైన్, 3 తులాల నానుపథకం, 2 తులాల చైన్, 8 గ్రాముల రింగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షేక్‌వలీ బాబాపై ఆంధ్రప్రదేశ్‌లో 8 చోరీ కేసులు, హైదరాబాద్‌లో ఒకటి, ఇటీవల మహబూబ్‌నగర్‌లో ఒక చోరీ కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు. వారం రోజుల్లో చోరీ కేసును ఛేదించిన మూసాపేట ఎస్‌ఐ విజయభాస్కర్, సీసీ ఎస్ పోలీసులను జిల్లా ఎస్పీ నర్సింహ, భూత్పూర్ సీఐ రామకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీసులు ఉన్నారు.



సీఐ కార్యాలయంలో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ

నేడు ఉమ్మడి జిల్లా కళాకారుల ప్రదర్శనల పోటీ

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో శ్రీసరస్వతి కళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లా కళాకారుల ప్రదర్శనల పోటీ నిర్వహిస్తున్నటు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. పట్టణంలోని శ్రీసాయిరాం ఫంక్షన్‌హాల్లో ఐదు రోజుల పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో కళాకారులు పాల్గొంటారని తెలిపారు. బాల బాలికల నృత్య ప్రదర్శనలు, పేరుగాంచిన కళాకారులతో పౌరాణిక, జానపద నాటకాల పోటీ ఉంటుదని పేర్కొన్నారు. పోటీలో విజేతలకు నగదుతో పాటు షీల్డ్, ప్రశంసాపత్రాలు ప్రముఖుల ద్వారా అందజేస్తామని తెలిపారు. శ్రీ సరస్వతి కళా సమితి నాలుగు దశాబ్దాలు (42 వసంతాలు) పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



మంచాలకట్టలో



రేవల్లిలో

భారీ చేపలు..

కృష్ణానదిలో మత్స్యకారుల వలకు భారీ చేప చిక్కింది. పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్టకు చెందిన కొత్తకృష్ణయ్య శనివారం చేపల వేటకు వెళ్లగా 18 కిలోల చేప చిక్కడంతో ఆనందం వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని గౌరిదేవిపల్లి చెరువులోనూ మత్స్యకారుడు తెప్ప మాధవ్ వలకు 18 కిలోల చేప చిక్కింది.

– పెంట్లవెల్లి/ గోపాల్‌పేట



పే..ద్ద మొసలి

జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురం చెరువులో పెద్ద మొసలి చిక్కింది. శనివారం గ్రామానికి చెందిన కొందరు చేపల కోసం వల వేయగా సుమారు 130 కిలోల బరువు గల మొసలి చిక్కడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించడంతో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ వచ్చి మొసలిని జూరాల డ్యాంలో వదిలిపెట్టారు.

– కేటీదొడ్డి

దారి తప్పిన సీబీఐ దర్యాప్తు

వివేకా హత్యపై చార్జ్‌షీట్‌లో అభియోగాలన్నీ నిరాధారం

1,226 రోజుల దర్యాప్తులో సీబీఐ సాధించింది శూన్యం

దేశంలోనే ప్రముఖ న్యూస్ వెబ్‌సైట్ 'ద వైర్' విశ్లేషణ



సాక్షి, అమరావతి: 'మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు.. రాజకీయంగా అత్యంత సంచలనమైన కేసు.. దర్యాప్తు చేస్తోంది దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ. దర్యాప్తు చేపట్టిన 1,226 రోజుల తర్వాత కూడా సీబీఐ సాధించింది ఇదీ అని చెప్పడానికి ఏమీ లేదన్నది నిర్వివాదాంశం. హత్య వెనుక విస్తృత కుట్ర ఉందనే మాట చెప్పడం తప్ప.. అందుకు సంబంధించి సీబీఐ నమోదు చేసిన అభియోగాలకు ఒక్కటంటే ఒక్కదానికి కూడా ఆధారాలు చూపించలేకపోయింది' అని ప్రముఖ జాతీయ వార్త వెబ్‌సైట్ 'ద వైర్' పేర్కొంది. నిష్పాక్షికమైన థర్డ్ పార్టీగా 'ద వైర్' వెబ్‌సైట్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఇటీవల దాఖలు చేసిన తుది చార్జ్‌షీట్‌లోని అంశాలను విశ్లేషించింది. రాజకీయ, నేర, న్యాయ సంబంధమైన వార్తా విశ్లేషకురాలిగా సుదీర్ఘ అనుభవం ఉన్న సరిత రాణి 'ద వైర్' వెబ్‌సైట్‌లో రాసిన విశ్లేషణాత్మక వ్యాసం ఇలా..

సాధించింది శూన్యం

2020 మార్చి 11న వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐకి బదిలీ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే 120 రోజుల సమయం తీసుకుంది. మరో 474 రోజుల తర్వాత 2021 అక్టోబర్‌లో మొదటి చార్జ్‌షీట్ దాఖలు చేసింది. వివేకా హత్యలో పాలుపంచుకున్నారని చెబుతూ ఎర్ర గంగిరెడ్డి(ఏ-1), సునీల్ యాదవ్(ఏ-2), గజ్జల ఉమాశంకర్ రెడ్డి(ఏ-3), దస్తగిరి(ఏ-4)లను నిందితులుగా పేర్కొంది. ఈ హత్య వెనుక విస్తృత కుట్రను వెలికి తీయాల్సి ఉందని చెప్పింది. సీబీఐ తుది చార్జ్‌షీట్ 2023 జూలై 20న బయటకు వచ్చింది. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వారి సన్నిహితుడు డి.శివశంకర్‌రెడ్డిలను కూడా నిందితులుగా పేర్కొంది. కానీ సీబీఐ మొదటి నుంచీ పేర్కొంటూ వచ్చిన విస్తృత కుట్ర గురించి మాత్రం ఏమీ చెప్పలేకపోయింది. హత్య వెనుక ఉద్దేశం అంటూ 14 పేరాల సుదీర్ఘ వ్యాసాన్ని చార్జ్‌షీట్‌లో పొందుపరిచింది. అందులో ఏముంది అంటే అందరికీ తెలిసిన వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబ నేపథ్యం, వంశ చరిత్ర మాత్రమే. ఇది తప్ప వాస్తవానికి హత్య వెనుక విస్తృత కుట్ర గురించి సీబీఐ స్పష్టంగా ఏమీ చెప్పలేకపోయింది. ఇంతకీ ఇంతటి హైప్రొఫైల్ కేసుకు సంబంధించిన తుది చార్జ్‌షీట్‌లో పేర్కొన్న అంశాలు, వాటిలోని వాస్తవాలను పరిశీలిస్తే సీబీఐ దర్యాప్తులో డొల్లతనం బట్టబయలు అవుతోంది.

సీబీఐ తాను పేర్కొన్న అభియోగాలకు సంబంధించి ఒక్కటంటే ఒక్క దానికి కూడా ఆధారం చూపించలేకపోయింది. అంతకు మించి వివేకా హత్య వెనుక ఆయన సొంత కుటుంబంలో విభేదాలు, బయట శక్తుల ప్రమేయాన్ని సీబీఐ పట్టించుకోకపోవడం విస్మయ పరుస్తోంది. చార్జ్‌షీట్‌లో సీబీఐ ఏం చెప్పింది.. అందులోని వాస్తవం ఏమిటన్నది అంశాల వారీగా పరిశీలిస్తే ఈ కేసులో సీబీఐ ఇప్పటి వరకు సాధించింది శూన్యమన్నది స్పష్టమవుతోంది. సీబీఐ చెప్పిందేమిటి? వాస్తవం ఏమిటి? అన్నది చూద్దాం.

1.వివేకా క్రియాశీలకమైన నేత?

సీబీఐ: 2019 నాటికి వివేకా రాజకీయంగా ప్రభావవంతమైన నేత. రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నారు.

వాస్తవం: 2019 నాటికి వివేకా రాజకీయంగా ప్రభావవంతమైన నేత కాదు. హత్యకు గురయ్యే 15 ఏళ్ల ముందు 2004లో చివరిసారిగా ఎన్నికల్లో గెలిచారు. దశాబ్ద కాలంగా రాజకీయంగా క్రియాశీలకంగా లేరు. 2008లో స్వదేశానికి తిరిగి వచ్చిన వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం సోనియా గాంధీని కలిశారు. కానీ ఆయనకు టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం తిరస్కరించింది. వివేకా రాజకీయాల నుంచి రిటైర్ అయ్యారని ఆయన కుమార్తె సునీతనే సీబీఐకి రెండుసార్లు చెప్పారు. 2011లో పులివెందుల ఉప ఎన్నికల్లో వైఎస్ విజయమ్మపై పోటీ చేసి ఓడిపోయిన తర్వాత నుంచి ఆయన రాజకీయాల నుంచి రిటైరై పోయినట్టేనని ఆమె చెప్పారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా రాజీనామా చేసిన తర్వాత నుంచి ఆయన ఎలాంటి పదవిలో లేరు. పులివెందుల ఉప ఎన్నికల్లో విజయమ్మ చేతిలో భారీ తేడాతో ఓడిపోయాక కాంగ్రెస్ పార్టీ కూడా ఆయన్ను పట్టించుకోలేదు. ఎమ్మెల్సీగా కూడా నామినేట్ చేయలేదు. ఆయన అసెంబ్లీలో ఓ ఎమ్మెల్యేపై దాడికి యత్నించడం కూడా ఇందుకు కారణం అయిఉండొచ్చు.

2.అవినాశ్ బలమైన అభ్యర్థి కాదా?

సీబీఐ: 2019 ఎన్నికల్లో కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు వైఎస్ అవినాశ్ రెడ్డి బలహీనమైన అభ్యర్థి అని వివేకానందరెడ్డి భావించారని షర్మిల సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు.

వాస్తవం: అవినాశ్‌రెడ్డి బలహీనమైన అభ్యర్థి అన్నది పూర్తిగా అవాస్తవం. ఆయన అప్పటికే సిట్టింగ్ ఎంపీగా ఉన్నారు. 2014 ఎన్నికల్లో 1,90,323 ఓట్ల భారీ మెజార్టీతో ఎంపీగా గెలిచారు. ఆయన ఎంత బలమైన అభ్యర్థో ఆ మెజార్టీనే చెబుతుంది. ప్రత్యేక హోదా సాధన డిమాండ్‌తో పార్టీ నిర్ణయం మేరకు తన ఎంపీ పదవికి 2018లో రాజీనామా చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అవినాశ్‌రెడ్డి మరింత భారీ మెజార్టీతో అంటే 3,80,976 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డిపై అంత మెజార్టీ సాధించడం విశేషం. ఏ రకంగా చూసినా అవినాశ్‌రెడ్డి బలమైన అభ్యర్థి అన్నదాంట్లో సందేహం లేదు. వివేకానందరెడ్డి తాను హత్యకు గురికావడానికి ముందు వరకు కూడా అవినాశ్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం చేశారని ఆయన అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పారు. వివేక హత్యకు గురైన ముందు రోజు రాత్రి కూడా అవినాశ్‌రెడ్డి గెలుపు కోసం జమ్మలమడుగులో ప్రచారం చేశారని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పినట్టు వెల్లడించారు. అవినాశ్‌రెడ్డే ఎంపీ అభ్యర్థి అన్న విషయంలో మరో మాటే లేదని వివేకానందరెడ్డి సోదరి వైఎస్ విమల కూడా స్పష్టం చేశారు. ఎంపీగా అవినాశ్ గెలుపు కోసం వివేకా చివరి వరకు ప్రచారం చేశారని కూడా ఆమె చెప్పారు. ప్రస్తుతం కొందరు రాజకీయ దురుద్దేశంతో అవినాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

3. షర్మిల వాంగ్మూలంలో చెప్పినదానికి ఆధారం ఎక్కడ?

సీబీఐ: 2019 ఎన్నికల్లో కడప ఎంపీ అభ్యర్థిగా షర్మిల కానీ, విజయమ్మ కానీ పోటీ చేయాలని వివేకా భావించారనే విషయాన్ని షర్మిల వెల్లడించారు.

వాస్తవం: కడప ఎంపీ అభ్యర్థిత్వం విషయంపై వివేకానందరెడ్డి తనతో చెప్పినట్టుగా షర్మిల వెల్లడించిన సమాచారానికి ఎలాంటి ఆధారం లేదు. ఎంపీగా తానుగానీ తన తల్లి విజయమ్మగానీ పోటీ చేయాలని వివేకా చెప్పినట్టు వాంగ్మూలం ఇచ్చిన షర్మిల.. అందుకు ఎలాంటి ఆధారం చూపించలేకపోయారు. ఎంపీ టికెట్ అంశంపై వారిద్దరు మాట్లాడుకున్నట్టు కూడా గతంలో ఎప్పుడూ మీడియాలోగానీ పార్టీ వర్గాలుగానీ చెప్పలేదు. సీబీఐ ఎలాంటి ఆధారం గురించి పేర్కొన లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన రెండేళ్ల తర్వాత షర్మిల తన సోదరుడితో రాజకీయంగా విడిపోయి తెలంగాణలో సొంతంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ పేరుతో రాజకీయ పార్టీని స్థాపించారు. ఆ విషయం కూడా ప్రస్తుతం ప్రాధాన్యం సంతరించుకున్నదే. ఒక వేళ కడప ఎంపీ అభ్యర్థి విషయంపై వివేకానందరెడ్డికి వేరే అభిప్రాయం ఉన్నా సరే రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపించదు. 2011లో పులివెందుల ఉప ఎన్నికల్లో విజయమ్మపై పోటీ చేసినప్పటి నుంచి వైఎస్సార్ కుటుంబ వ్యవహారాల్లో ఆయన పాత్ర పెద్దగా లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ రాజకీయ నిర్ణయాల్లో కూడా ఆయన పాత్ర పెద్దగా ఏమీ లేదన్నది ఆంధ్రప్రదేశ్‌లో అందరికీ తెలిసిన విషయమే. వివేకానందరెడ్డిపై సానుకూల దృక్పథంతో వైఎస్ జగన్ ఆయన్ను వైఎస్సార్ జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ చేశారు. కానీ వివేకా ఏనాడూ కూడా పార్టీ ముఖ్య నేతగా ఉండలేదు.

4. ఎమ్మెల్సీ ఎన్నికలపై సీబీఐ చెప్పింది కట్టుకథే

సీబీఐ: 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమికి అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, డి.శివశంకర్‌రెడ్డి కారణం. అవినాశ్‌రెడ్డి అనుచరుడు డి.శివశంకర్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేయాలని భావించినప్పటికీ వైఎస్ జగన్ తన చిన్నాన్న వివేకానందరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. దాంతో అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి ఆ ఎన్నికల్లో వివేకా ఓటమికి పని చేశారు. దాంతో వివేకా ఆగ్రహంతో డి.శివశంకర్‌రెడ్డిని దూషించారు.

వాస్తవం: స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమికి అవినాశ్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, శివ శంకర్‌రెడ్డి కారణమనడానికి సీబీఐ ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది. ఆ ఎన్నికల్లో ఆ జిల్లాలోని 10 నియోజకవర్గాల పరిధిలోని 800 మందికిపైగా ఓటర్లలో ఎవర్ని ప్రలోభాలకు గురిచేశారో కూడా చెప్పలేకపోయింది. ఆ ఎన్నికల్లో గెలిచిన టీడీపీ అభ్యర్థి బీటెక్ రవితో సీబీఐ కనీసం మాట్లాడనే లేదు. ఆ ఎన్నికల్లో వివేకా ఓటమికి, ఆయన హత్యకు సంబంధం ఉన్నట్టుగా కూడా సీబీఐ ఎలాంటి ఆధారాన్ని చూపించనే లేదు. రెండేళ్ల క్రితం నాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో విషయంపై తలెత్తిన వివాదం వల్ల తమను దూషించారనే ఉద్దేశంతో 2019 ఎన్నికల ముందు హత్యకు ఎవరైనా ప్రయత్నిస్తారా? అందులోనూ 2014 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన అభ్యర్థి కుటుంబం 2019 ఎన్నికల ముందు హత్య వంటి దుందుడుకు పనులకు ఎందుకు ఒడిగడుతుంది? పైగా 2019 ఎన్నికల్లో 3.80 లక్షల ఓట్ల మెజార్టీతో గెలిచిన అవినాశ్ రెడ్డికి వివేకాతో రాజకీయంగా ఎలాంటి ఇబ్బంది ఉంటుంది? ఏమాత్రం ఉండదు. సీబీఐ తమ ఆరోపణకు ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది.

వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో విభేదాలు

షమీమ్ అనే మహిళను వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకోవడంతో ఆ కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. వివేకా గుండెకు ఆపరేషన్ చేసుకున్నప్పటికీ ఆయన మొదటి భార్య సౌభాగ్యమ్మ పులివెందులలో ఉండటం లేదు. హైదరాబాద్‌లో తన కుమార్తె సునీత నివాసంలో ఉంటున్నారు. నెలకు ఒకట్రెండుసార్లు పులివెందుల వచ్చి వెళుతున్నారు. కుమార్తె సునీత ఏడాదికి ఒకట్రెండుసార్లు మాత్రమే వస్తున్నారు. 'షమీమ్‌తో మా నాన్న సహజీవనం చేస్తున్నారని 2011లో బయటపడినప్పటి నుంచి ఆయనతో నేను సఖ్యతగా లేను. పులివెందులకు ఎప్పుడోగాని వెళ్లడం లేదు. 2018లో క్రిస్మస్ తర్వాత మళ్లీ నేను పులివెందుల వెళ్లనే లేదు. నా భర్త ఎన్.రాజశేఖరరెడ్డి మాత్రం అప్పుడప్పుడు వెళుతుండేవారు' అని సునీత చెప్పారు. వివేకానందరెడ్డి తన పేరును అక్బర్‌ఖాన్‌గా మార్చుకుని షమీమ్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు ఉన్నారు. షమీమ్ కుటుంబం నిర్వహణ బాధ్యత చూస్తుండటంతోపాటు ఆమె చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేశారు. బలపనూరులో ఆమె ఇంటి పై అంతస్తును నిర్మించడంతోపాటు 8 సెంట్ల స్థలం కొనుగోలు చేశారు. ఇక వివేకానందరెడ్డి మొదటి భార్య సోదరులు తనను బెదిరించేవారని షమీమ్ సీబీఐకి చెప్పారు. పెద్ద భార్య పెద్ద సోదరుడు శివప్రకాశ్‌రెడ్డి తన ఇంటికి వచ్చి బెదిరించారని తెలిపారు. తన కుమారుడికి హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సీటు ఇప్పించడంతోపాటు అక్కడే ఓ ఇల్లు కొని ఇచ్చి.. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని వివేకా షమీమ్‌కు మాట ఇచ్చారు. కానీ అంతలోనే వివేకా హత్యకు గురయ్యారు.

బయటి శక్తుల పాత్ర పట్టించుకోని సీబీఐ

వివేకా హత్య కేసు విషయంలో సీబీఐ దర్యాప్తు ఇప్పటికీ ఎలాంటి స్పష్టత ఇవ్వనే లేదు. కుటుంబ విభేదాలు, రాజకీయంగా అడ్డుకునేందుకు యత్నించారంటూ సీబీఐ చెబుతున్న కారణాలేవీ కూడా నమ్మదగ్గవిగా లేవు. వాటికి ఎలాంటి ఆధారాలూ లేవు. అదే సమయంలో వివేకా కుటుంబంలో విభేదాలు, ఇతర అంశాలను కూడా లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంది. మొత్తం ఉమ్మడి కుటుంబంలో విభేదాలు అనే అంశాన్నే సీబీఐ ప్రధానంగా ప్రస్తావిస్తుండటం కేవలం కేసును తప్పుదారి పట్టించేందుకేనని స్పష్టమవుతోంది. వివేకా హత్య వెనుక బయటి శక్తుల ప్రమేయంపై సీబీఐ ఇప్పటి వరకు దృష్టి సారించనే లేదు. ఇప్పటి వరకు కేవలం సీబీఐ అప్రూవర్‌గా మార్చిన నిందితుడు దస్తగిరి, వాచ్‌మన్ రంగయ్య వాంగ్మూలాలనే ఆధారంగా చేసుకుని దర్యాప్తు చేస్తోంది. కానీ వారు నిజాలే చెబుతున్నారడానికి ఆధారం ఏమిటి?

అప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో వివేకా

వివేకానందరెడ్డి షమీమ్‌ను రెండో వివాహం చేసుకోవడంతోపాటు ఆస్తి ఇస్తానని చెప్పడంతో మొదటి భార్య కుటుంబం ఆగ్రహించింది. కుటుంబానికి చెందిన కంపెనీల్లో ఆయనకు చెక్ పవర్ రద్దు చేసింది.చెక్‌పవర్ రద్దు కావడంతో వివేకా ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. మద్యం, ఇతర అవసరాలకు కూడా చేతిలో డబ్బులు లేక అల్లాడిపోయారని వివేకా ఇంట్లో పనివానిగా ఉన్న పెందింటి రాజశేఖర్ చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆయన సునీల్ యాదవ్, దస్తగిరిలతో సన్నిహితమయ్యారు. వారు చెప్పినట్టు చేస్తే వారిద్దరు డబ్బులు తెస్తారని ఎర్ర గంగిరెడ్డి వివేకాతో చెప్పేవారు. ఎనిమిది మంది నుంచి రూ.5 కోట్లు అప్పు తీసుకున్నారు. ఓసారి పెందింటి రాజశేఖర్ వివేకానందరెడ్డి అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పారు. తమ ఇంట్లో డబ్బు కోసం ఏదో గొడవ జరుగుతోంది.. వివేకానందరెడ్డి బాగా తాగేసి గొడవ చేస్తున్నారని చెప్పారు. 'మా నాన్న వివేకా ఇష్టానుసారంగా అప్పులు చేసి, తీర్చకపోవడంతో కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ట్రాక్ రికార్డ్ సరిగా లేకపోవడంతో కంపెనీలకు బ్యాంకులు అప్పులు ఇచ్చేందుకు సుముఖత చూపలేదు. కంపెనీల నిర్వహణకు బ్యాంకుల నుంచి రుణం తీసుకునేందుకు అడ్డంకిగా ఉండకూడదనే మా నాన్న చెక్ పవర్‌ను రద్దు చేశాం' అని సునీత చెప్పారు. వాస్తవం ఏమిటంటే.. వివేకానందరెడ్డి హత్య తర్వాత ఆయన స్థానంలో సునీత ఆ కంపెనీల్లో డైరెక్టర్ అయ్యారు. జీవించి ఉండగా రోజువారి ఖర్చుల కోసం వివేకా ఇబ్బందులు పడ్డారు. కానీ ఆయన మరణించిన తర్వాత కొన్ని నెలలకే నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆ కంపెనీ అప్పులన్నీ చాలా వరకు తీర్చేశారు. కంపెనీలన్నీ గాడిలో పడ్డాయి. ఈ ఏడాది జనవరిలో 93 ఎకరాల భూమిని సౌభాగ్యమ్మ, సునీత పేరిట బదిలీ చేశారు.

బీచుపల్లి అంజన్న చరిత్ర పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీతారామిరెడ్డి

ఎర్రవల్లి చౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో శనివారం బీచుపల్లి ఆంజనేయస్వామి క్షేత్ర చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ సీతారామిరెడ్డి హాజరై వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపురానికి చెందిన పోతేదార్ రాఘవాచారికి రచించిన ఆంజనేయస్వామి క్షేత్ర చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వయస్సు మీద పడినా ఇంత గొప్ప చరిత్ర కలిగిన పుస్తకాన్ని రచించడం గర్వకారణమన్నారు. అనంతరం పుస్తక రచయిత పోతేదార్ రాఘవాచారికి పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, భీమేశ్వరరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, రామిరెడ్డి, ఆంజనేయులు, మహేశ్వరెడ్డి, దేవేందర్‌రెడ్డి, వేమన, శేఖర్‌రెడ్డి, రఘు ఉన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు



ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జైపాల్‌యాదవ్

కల్వకుర్తి/దేవరకద్ర రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును శనివారం ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు కలిశారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కోరినట్లు తెలిపారు. కల్వకుర్తి, ఆమనగల్ మున్సిపాలిటీల అభివృద్ధి, పాలిటెక్నిక్ కళాశాల, 50 పడకల ఆస్పత్రికి నిధులు, గట్టు ఇప్పలపల్లిలో బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. దేవరకద్రలో 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయాలని సీఎం కేసీఆర్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావుకు ఫోన్ చేసి చెప్పినట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం కేసీఆర్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు ధన్యవాదాలు తెలిపారు.

దరఖాస్తుకు వేళాయె..

ఆగస్టు 31 వరకు 'ఇన్‌స్పైర్ మనక్'కు గడువు

- ప్రతి పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు
- గతేడాది ఉమ్మడి జిల్లా నుంచి 2,919 దరఖాస్తులు
- 286 ప్రయోగాలకు ఎంపిక



జిల్లాల వారీగా 2022-23లో వచ్చిన దరఖాస్తులు..

జిల్లా	దరఖాస్తులు	ఎంపికైనవి
నారాయణపేట	228	30
మహబూబ్‌నగర్	808	67
వనపర్తి	540	53
గద్వాల	540	70
నాగర్‌కర్నూల్	803	66

మద్దూరు: విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టి, వారిని భావి శాస్త్రవేత్తలుగా తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనక్ పేరిట అవార్డులు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ప్రయోగాలకు అవసరమయ్యే ఖర్చులను ఇచ్చి అండగా నిలుస్తోంది. దీంతో విద్యార్థులు ప్రతి ఏటా కొత్తకొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నారు. గత ఏడాది ఉమ్మడి జిల్లా నుంచి 2,919 మంది విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తు చేసుకోగా 286 ప్రయోగాలు ఎంపికయ్యాయి. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని అధికారులు తెలిపారు.

6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు..

ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ ప్రయోగాలు చేయవచ్చు. విద్యార్థులు ముందుగా వారు ప్రదర్శించే ప్రయోగాల వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వాటిని ఎస్ఐటీ వారు పరిశీలించి ఉత్తమ ప్రయోగాలను ఎంపిక చేస్తారు. ఇలా దేశ వ్యాప్తంగా లక్ష ప్రయోగాలను ఎంపిక చేస్తారు. అందులో 10వేల ఉత్తమ ప్రయోగాలకు ఒక్కోదానికి రూ.10వేలు కేటాయిస్తారు. ఈ డబ్బులను కేంద్ర ప్రభుత్వం నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఈ డబ్బులతో ప్రయోగానికి అవసరమైన వస్తువులను కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. ఇన్‌స్పైర్ మనక్‌లో పాల్గొనే విద్యార్థులు 10 నుంచి 15ఏళ్లలోపు వారై ఉండాలి.

యాజమాన్యం చొరవ చూపాలి..



ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ల కోసం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ప్రతి పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు వేయడానికి ఓ ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థుల ఆలోచన, సృజనాత్మక పెంపొందించడానికి దేశవ్యాప్తంగా నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్ పాలుపంచుకోవడానికి జిల్లాలోని అన్ని పాఠశాలలను భాగస్వామ్యం చేస్తున్నాం.

– భానుప్రకాష్, జిల్లా సైన్స్ అధికారి, నారాయణపేట

దరఖాస్తు చేసే విధానం..

ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు దరఖాస్తు చేసే విద్యార్థికి బ్యాంక్ అకౌంట్ ఉండాలి. ఆధార్ నంబర్, రెండు పాస్‌ఫొటోలు, బ్యాంక్ ఖాతా నంబర్‌ను స్కాన్ చేసి , ప్రయోగానికి సంబంధించిన పేరును, వివరాలను సంక్షిప్తంగా ఓ పేపరుపై రాసి స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. పాఠశాల డైస్ నంబర్, మెయిల్ ఐడీ, పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, ప్రధానోపాధ్యాయుడి పేరు, సైన్స్ టీచర్ పేరు, ఇన్‌స్పైర్ ఇన్‌చార్జీ ఉపాధ్యాయుడి పేరుతో పాటు సెల్ నంబర్, పాఠశాల పూర్తి చిరునామాతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న 48 గంటలోపు విద్యార్థి మెయిల్‌కు యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్ వస్తాయి. వీటిని జాగ్రత్తగా గుర్తించుకుంటే దరఖాస్తు చాలా తేలిక. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఆధారంగా విద్యార్థుల వెబ్‌సైట్ నుంచి నామినేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

కాల్వ ఇలా.. నీరు పారేదెలా?



గట్టు, మాచర్ల మధ్యన నెట్టెంపాడు కాల్వ

గట్టు: సాగు నీటికోసం గట్టు మండల రైతాంగం అష్టకష్టాలు పడుతుంటారు. బోరు బావుల ద్వారా వచ్చే కొద్దిపాటి నీటిని చాలా పొదుపుగా పంటలకు వాడుకుంటుంటారు. నెట్టెంపాడు కాలువ నీళ్ల రాకతో రైతుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. చాలా మంది రైతులు బీడు భూములను కాల్వ నీటి కారణంగా సాగులోకి తీసుకువచ్చారు. అంతా బాగానే ఉన్నా నెట్టెంపాడు కాల్వ మూడేళ్లుగా ఎలాంటి పనులు చేయకపోవడంతో ముండ్ల కంపలు, పిచ్చిమొక్కలు, జమ్ము పెరిగింది. దీంతో నీరుపారడం కష్టంగా మారింది. ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారా పెంచికలపాడు, ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి, గట్టు, యలదొడ్డి, మాచర్ల, బల్గెర, మల్లంపల్లి, చమన్‌ఖాన్‌దొడ్డి, ఇందువాసి శివారు వరకు నీరు పారుతున్నాయి. అక్కడక్కడ కాల్వలో పిచ్చిమొక్కల వల్ల నీరు పారడానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి కాల్వలో ఉన్న వాటిని తొలగించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కురుమూర్తిస్వామి హుండీ ఆదాయం రూ.2.94 లక్షలు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామికి అమవాస్య, శని, సోమవారాల్లో భక్తులు సమర్పించిన కానుక లు, హుండీని ఆలయ సిబ్బంది శనివారం లెక్కించారు. స్వామి వారి హుండీ ఆదాయం రూ.2,94,962 వచ్చినట్లు ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. లెక్కింపులో ఆలయ సిబ్బంది, భక్తులు ఉన్నారు.



కురుమూర్తి స్వామి హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ప్రయాణికులకు మెరుగైన సేవలు



గద్వాల రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఆర్ఎం

మహబూబ్‌నగర్, గద్వాల రైల్వేస్టేషన్లను పరిశీలించిన డీఆర్ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్/ గద్వాల అర్బన్: పాలమూరులోని రైల్వేస్టేషన్‌ను శనివారం నూతన హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ వైష్ణోయ్ పరిశీలించారు. డీఆర్ఎం ముందుగా లాబీ, బుకింగ్ కార్యాలయం, స్టేషన్ మాస్టర్ గది, రెస్ట్‌హౌజ్‌లను పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిసరాలతో పాటు గార్డెన్‌ను కూడా తనిఖీ చేశారు. నూతన డీఆర్ఎంను సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ మహబూబ్‌నగర్ బ్రాంచి కార్యదర్శి భాస్కర్‌యాదవ్, చైర్మన్ శ్రీనివాస్‌తోపాటు మజ్దూర్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి జానకిరామయ్య తదితరులు పూలబొకెలు అందజేసి స్వాగతం పలికారు. డీఆర్ఎం వెంట పలు విభాగాల అధికారులు ఉన్నారు. అంతకు ముందు గద్వాల రైల్వేస్టేషన్‌లోని ఆయా విభాగాల్లో ఆపరేటింగ్ ప్యానల్స్, స్టేషన్ కార్యాలయాలు, పరిసరాలను డీఆర్ఎం పరిశీలించారు. ప్రయాణికుల ఇబ్బందులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. రైల్వేస్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డీఆర్ఎంకు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ శంకర్ మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. డీఆర్ఎం వెంట రైల్వే అధికారులు నీలా పావని, వెంకటకుమార్, మల్లికార్జున్, కిరణ్, శ్రీతేజ, బాలాజీ, గద్వాల స్టేషన్ సూపరింటెండెంట్ సుమిత్ కుమార్, రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తదితరులున్నారు.

ఆల్వాన్‌పల్లి సమీపంలో మీనాంబరం వద్ద అలుగు పారుతున్న చెక్‌డ్యాం



చెక్‌డ్యాంలు నింపుతూ.. ముందుకు

మండలంలోని దుందుభీ వాగు పరవళ్లు తొక్కుతుంది. ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగు నిండుగా ప్రవహిస్తోంది. ఫలితంగా కోడ్గల్, లింగంపేట, ఆల్వాన్‌పల్లి గ్రామాల పరిధిలో వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు అలుగు పారుతుండడంతో జలకళ ఉట్టిపడుతోంది. వాగు పరివాహక ప్రాంతంలో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని, తద్వారా బోర్లలో నీటిమట్టం పెరిగి పంటలు పండుతాయని రైతులు పేర్కొంటున్నారు.

– జడ్చర్ల